# స్వప్రకాశ కిరణాలు

*అనంతమైన ప్రకృతికి పిత, విస్తృతమైన వాక్సంపదకు మూలము అయిన*
*పరమేశ్వరునకు ఆలోచన సుమాంజలి*

భగవంతుడు ఉన్నాడా, అలాంటి మూలశక్తి వ్యక్తరూపంలో ఉన్నదా అన్న ప్రశ్న చాలా సార్లు చాలా మంది వేశారు. అనేకులు తమకు తోచిన రీతిలో సమాధానం ఇచ్చారు. ముప్ఫైయవ మానవ సంవత్సరపు ఆయుష్షు ఉన్న నేను ఈ ప్రశ్నకు సమాధానం ఇచ్చే ప్రయత్నం చేస్తూ, ఈ ప్రకృతి ఏమిటి, ఎందుకు ఇలా ఉంది, ఇందులో  భగవంతుడి ప్రమేయం ఎంత వరకు ఉండవచ్చు అని నా ఊహకు స్ఫురించినంతమేరకు వ్రాస్తున్న ఆలోచనా స్రవంతి.

హిందూ సమాజంలో భగవచ్చింతన చాలా ఎక్కువ అనే చెప్పాలి. అయితే వచ్చిన సందేహం – "అది" ఉన్నదా? ఉంటే ఎలా ఉంటుంది? అని.

అతిపురాతనమైనవిగా చెప్పబడుతున్న వేదములు ఈ సందేహానికి పలు విధాలుగా సమాధానాలు చెప్పాయి. వీటిని నమ్మి అవి చెప్పిన జీవనశైలిలో ఉన్నవారిని ఆస్తికులు అని, అందుకు వ్యతిరేకంగా జీవనశైలిలో ఉన్నవారిని నాస్తికులు అని అంటారు. నాస్తికవర్గంలోకి భగవంతుడు లేడు అనే వాళ్ళను, హేతువాదులను కూడా వర్గీకరించడం జరిగింది. నేను ఏ వర్గంలోకి వస్తానో చేప్పే స్థితిని అర్థం చేసుకోవడానికి చేసే ప్రయత్నం నేను రాస్తున్నఈ రాతలు.

దేవుడు అని పిలువబడుతున్న "అది", మానవులు మరియు మిగిలిన జీవరాశులకన్న ఎక్కువ శక్తి కలదని, అదే ఈ కళ్ళకు కనిపిస్తున్న సమస్త సృష్టి రచన చేసింది అని, దీన్ని నిర్వహిస్తున్నది అని, ఆఖరున అంతం చేస్తున్నదని చాలా మంది విశ్వసిస్తారు. అయితే "ఆ" ఒక్కటి ఈ పని చేయడానికి మూడుగా మారి సృష్టి, స్థితి లయములను నిర్వహిస్తున్నదని, అవి పురుషరూపాలు అని, అవి ఇంకొక స్త్రీ స్వరూపాలను వివాహం చేసుకుని భార్యలుగా చేసుకున్నారు అని చాలా మంది విశ్వసిస్తారు. అయితే ఈ స్త్రీ స్వరూపాలు అన్నిటిని అమ్మవారు అని ఒక పదంతో నిర్వచిస్తారు. దీనికి మద్దతుగా ఒక కథ ప్రచారంలో ఉంది. మొదట్లో ఒకే ఒక అమ్మ ఉందని, ఆవిడ ముగ్గురు పిల్లల్ని సృష్టి చేసింది అని, వారే బ్రహ్మ, విష్ణువు, శివుడు అని, తిరిగి ఆమే వారికి భార్యలుగా వచ్చిందని అంటారు. అలా స్త్రీ స్వరూపంలో ఉన్న భగవంతుడికి ప్రాముఖ్యత ఇవ్వబడింది. వేరొక చోట శివుడు ముఖ్యుడని, ఇంకొకసారి విష్ణువు ముఖ్యుడని, మరొకటని మరొకటని ప్రచారంలో ఉన్నాయి. వాటి వాటి కథలు మరియి వివిధ భాషలలో ఆయా స్వరూపాలకు ప్రాముఖ్యతను ఇస్తూ సాహిత్యాలు ఉన్నాయి. వేదాలలో చెప్పిన ఇంద్రుడు, అగ్నికన్నా ఉన్నత స్థితిలో ఇంకొక దేవతా స్వరూపం ఉంది అని చాలా వ్యాఖ్యానాలు ఉన్నయి. ఇలా నవగ్రహాలు, గణపతి, సుబ్రహ్మణ్యుడు, రాముడు, కృష్ణుడు అని, ఇవి కాకుండా వివిధ పేర్లతో పిలువబడుతున్న అమ్మవార్లు, అయ్యవార్లు అనే దేవుళ్ళు చాలామందిని హిందూదేశంలో విశ్వసిస్తారు.

వీరంతా ఒకరిని ఒకరు పూజిస్తారు అని, మానవులకు రాక్షసులకు వరాలు ఇస్తారని కొంతమంది చెప్తారు. దేవతులు శక్తివంతులు మంచివాళ్ళు అని, వారివద్ద ఉన్న అమృతం వల్ల మరణం పొందరు అని, రాక్షసులు కూడా శక్తివంతులు, కానీ చెడ్డవారు అని, వారు దేవతల మీద యుధ్ధాలకు వెళ్ళి వారి వద్ద ఉన్న అపురూపమైన సంపద తీసుకెళ్తారు అని చిన్నపిల్లలకు చాలా మంది తల్లులు చెప్తూ ఉంటారు. ఆ దేవతలు, వారి గణాలు, కుటుంబాలు, ఇతరత్రా కలుపుకుంటే ముప్పైమూడుకోట్ల మంది ఉన్నరు అని ఒక సంఖ్య ప్రచారంలో ఉంది.

ఇలా మనుషులు వివిధ దేవతలను ఆరాధన చేస్తూ ఉంటే, ఇంకొక వర్గం మనుషులు అందరు దేవుళ్ళు లేరు, ఉన్నది ఒక్కటే అని, దేవుడు ఒక్కడే అని, అతనే వివిధరూపాలలో, వివిధ దేవతా స్వరూపాలతో ఉంటాడు అని, ఈ వాదాన్ని సమర్ధించడానికి ఇప్పటికే ప్రచారంలో ఉన్న స్తోత్రాలను, సాహిత్యాన్ని ఎత్తి చూపి, అసలు భగవంతుడు నిరాకారుడు, ఎలాంటి గుణాలు ఉండవని, అత్యున్నత స్థితిలో ఉంటాడు అని చాలా నిదర్శనాలు చూపారు.

స్థిమిత బుధ్ధితో ఆలోచిస్తే అన్ని వాదనలు ఒకసారి నమ్మశక్యంగాను, ఇంకొకసారి వితండవాదాలుగా అనిపిస్తాయి. అసలు ఏమిటి “ఇది” అని కలిగిన సందేహానికి నివృత్తి రూపం ఈ వ్రాతలు.

---

మానవుడు ఒక్కడే భగవంతుడి గురించి తెలుసుకోగలడు. ఇతర ప్రాణులు తెలుసుకునే శక్తి కలిగిలేవు. ఇది చాలామంది అభిప్రాయం. మాట చెప్పలేని స్థితి ఇందుకు కారణం. తనలోని భావాలను ఇతర మానవులకు తెలియజేయాలని అనిపిస్తే, దానికి మాట్లాడటం అనే ప్రక్రియను గొప్ప సాధనంగా వాడతారు. ఇలాంటి ప్రక్రియనే అరుపుల రూపంలో, శబ్దాల రూపంలో, కదలికలరూపంతో చాలా జీవరాశులు చేస్తూనే ఉన్నాయి. అంటే ఈ ప్రకృతిలో ఉన్న జీవాలు మానవుల్లా మాట్లాడినా మాట్లాడలేకపోయినా, భావవ్యక్తీకరణ చేస్తూనే ఉంటాయి. ఒక కుక్క మొరిగినట్లు అనిపించినా దాని భాషలో అది మాట్లాడుతోంది. అలాగే ఇతర ప్రాణులు, ఆఖరికి చీమలు, అంతకన్నా చిన్నగా ఉన్న ప్రాణులు వాటి భాషలలో అవి మాట్లాడుతాయి. కాకపోతే మానవులకు వినపడకపోవచ్చు, వినిపించినా అర్థం అయి ఉండకపోవచ్చు. అందువల్ల మానవుడికి మాత్రమే మాట్లాడే శక్తి ఉందని అంటున్నారు. ఇక్కడ ఒక ప్రశ్న. మరి పసిపాపలు కూడా మానవులే అయినప్పుడు వారికి మాట్లాడదం ఎందుకు రాదు? కాబట్టి మాట్లాడే శక్తి అంటే భావవ్యక్తీకరణ కోసం చేయబడే అరుపుల క్రమం.

ఇప్పుడు “చెప్పడం” అనేది ఉన్నది అని అర్థం అయినప్పుడు, చెప్పడానికి ఏది కారణమో చెప్పుకోవాలి. ఏదైనా చెప్పాలి అంటే ముందు తెలుసుకోవాలి. ఇంతకు ముందు తెలుసుకున్న విషయాలతో పోలిక వేసుకుంటూ తన విజ్ఞతని బట్టి, అవకాశాలను బట్టి కొత్త విషయాలు తెలుసుకోవడం జరుగుతుంది. తెలుసుకోవాలి అంటే ముందుగా గమనించి అర్థం చేసుకోవాలి. దేన్ని

గమనించాలి? గమనిస్తున్న ప్రాణియొక్క, లేదా వస్తువుయొక్క, పరిసరాలను గమనించాలి. ఆ పరిసరాలు ఈ ప్రకృతిలో కొంతభాగం. ప్రకృతిని గమనించి, తెలుసుకుని, తను తెలుసుకున్నది ఇతర ప్రాణులకు గాని, తనలాగే ఉన్న ప్రాణులకుగానీ తెలియజేసి, అవి కూడా తను తెలుసుకున్న రీతిలో తెలుసుకోవాలి అన్న కుతూహలం ప్రాణులకు సహజంగా ఉంది. మాట్లాడటం అనే ప్రక్రియ ఇక్కడ నుంచే మొదలు అయి ఉంటుంది. మాట్లాడేటప్పుడు తనకు అర్థం అయిన విషయం ఎదుటివారికి అర్థం కావడం కోసం పరస్పరం అంగికరించి అర్థం చేసుకున్న శబ్దకూటములు జీవాలు ఏర్పరుచుకున్నాయి. దీనినే భాష అంటారు. ఇలాంటి భాషలు అనేకం.

ఈ జీవాలు ఉంటున్న ఈ భూమి చాలా పెద్దది. మొదట్లో ఒక ప్రాంతంలో ఉండే జీవులు మరొక ప్రాంతంలోకి వెళ్ళేవి కాదేమో. అసలు ఇంకొక ప్రాంతం ఒకటి ఉంటుందని, అక్కడ ఏమి ఉంటాయో తెలుసుకోవాలన్న కూతూహలం మొదట్లో ఉండేది కాదేమో. పోను పోను జీవాలు, ముఖ్యంగా మనుషులు, తమకు తెలిసిన పరిధిని మించి ప్రకృతిని గమనిస్తూ ముందుకు సాగిపోతూ ఉండేవి. ఈ పరిసరాలలో ఇంకా ఏమి ఉన్నాయి, ఇది ఎంత పెద్దది అన్న ఆలోచనలకు ఆచరణాత్మకరూపం ప్రయాణం. ఒక్క జీవం మాత్రమేకానీ, మరికొన్నిటితో కలిసిగానీ వివిధ ప్రాంతాలకు వెళ్ళి ఉంటాయి. అలా ఇంకొక చోటికి వెళ్ళినప్పుడు అక్కడ ప్రకృతి గురించి, పరిసరాలు గురించి తెలుసుకుంటూ, తెలుసుకున్నది ఇతర ప్రాణులకి చెప్తూ వెళ్ళి ఉంటాయి. అలా తనలా ఉండే ఇతర జీవాలను చూస్తూ విషయాలు చెప్పడానికి జీవులు భాషను ఉపయోగించుకున్నయి. అది తన భాష కావచ్చు. లేక  కొత్త భాష కావచ్చు. ఇలా భాషను ఉపయోగిస్తూ, ప్రయాణిస్తూ, తనలాంటి వేరే ప్రాణులు కనిపిస్తే వాటితో సహవాసం చేస్తూ బ్రతుకుతూ ఉండేవి.

కదలికల వల్ల శరీరం అలసట పొంది, ప్రకృతి పదార్థాల నుండి వచ్చిన సువాసన వల్ల తినాలి అనే కోరిక పుట్టి, తిన్న తరువాత అలసట పోవడం జరిగి ఆకలి తీరడం అనే అనుభవం మొదలయి ఉండవచ్చు. ఆకలి తీర్చుకోవడం కోసం అందిన చెట్ల ఫలాలు తింటూ బ్రతికేవి. ఇలా ఆకలి తీర్చుకోవడం కోసం ఒకొక్కసారి ఇతర ప్రాణులను కూడా తినేవి. అయితే బాధ అనేది అర్థం అయి కొన్ని ప్రాణులు శాఖాహారులుగా స్థిరపడ్డాయి. మాంసపు రుచి వదులుకోలేని ప్రాణులు మాంసాహారులుగా స్థిరపడ్డాయి. ఆహారాన్ని  సాధించడం  కోసం సహాయపడే వస్తువులను సమకూర్చుకుని ఉపయోగించడం నేర్చుకున్నాయి. ఈ క్రమంలో ఆకలి తీర్చుకోవడం అనే ఒక జీవన విధానం మొదలయింది.

ఆకలి శరీరానికి తీరిన తరువాత, మానసిక ఆకలి పట్ల పరిశీలన మొదలవుతుంది. ఈ రకమైన తాపం కొన్ని రకాల ప్రాణులను చూస్తే కొంత ఉపశమించడం జరిగింది. అలాంటి ఇతర ప్రాణులతో సహవాసం చేసి వాటిలో కూడా ఉత్పన్నమైన తాపం ఉపశమనం కోసం పరస్పరం సహకరించుకుని ప్రేమని పెంచుకుని ఉండవచ్చు. అలా ప్రేమతో శారీరిక సుఖాలను వృద్ధి చేసుకుని సహగమనం చేయసాగాయి. కాలక్రమేణ ఒక రకం ప్రాణుల శరీరం వికారం పొంది, వాటి నుండి వాటిలాగ ఉండే మరో ప్రాణులు తయారవడం జరిగింది. వాటిని కూడా తీసుకుని ప్రయాణాలు సాగించి ఉండవచ్చు.  ఈ వరుసలోనే

బంధుత్వాలు ఏర్పడి ఉంటాయి. బహుశ పిల్లలు పుట్టడం ఎలా జరుగుతోంది అన్న ఆసక్తి నుంచే అసలు ఈ సృష్టి విశేషం తెలుసుకోవడం అవసరం అనిపించి ఉండవచ్చు.

ఈ ఆసక్తి చాలామందికి ఉన్నా, చావును చూసేవరకు దీనిపై శ్రద్ధ లేకపోయి ఉండవచ్చు. అటు ఇటు తిరుగుతున్న ప్రాణి ఉన్నట్టుంది అచేతనంగా ఎందుకు పడిపోతుంది. ఇంతకు ముందు కనిపించని ప్రాణిని చూస్తున్నప్పుడు, అది పెరుగుతున్నప్పుడు ఈ గమనిక అనే ప్రక్రియ ఎక్కువ అయి ఉంటుంది. ఈ గమనించిన విషయాన్ని ఇంతకు ముందు ఇలాగే జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుంటూ, భాష ద్వారా ఆ ఆసక్తిని ఇతరులకు కల్పించడం జరిగి ఉండవచ్చు. ఇలా చాలా మందికి కలిగిన ఆసక్తి ఆలోచనా ప్రవాహాల వల్ల జ్ఞాన జిజ్ఞాస అనేది పుట్టి ఉండవచ్చు.

ఆ ఆసక్తి నుంచి కొన్ని విషయాలు తెలియ వచ్చాయి. కంటికి కనిపించని ఒక అదృశ్యమైన శక్తి ఇలా చేస్తోంది అని. వానలు పడటం, సూర్యోదయం, రాత్రి పగలు, పైకి ఎగరేసిన వస్తువు కింద పడటం, చెట్లు వాటి ఆకారాలు, ఈ భూమి, సముద్రం, కొండలు, నీళ్ళు, అగ్ని, ఆకలి, జీవాలు కదలడం, పెరగడం, అచేతనంగా పడిపోవడం, ఇవన్నీ ఆ శక్తి వల్ల జరుగుతున్నాయి అని పూర్వకాలంలో ప్రాణులు నిర్ణయానికి వచ్చాయి. ఆ శక్తిని భగవంతుడు అని పిలవడం మొదలు పెట్టి ఉండవచ్చు. ఆ కాలంలోనే కాదు ఈ కాలంలో కూడా భగవంతుడు ఒక పట్టాన జీవుల ఊహకు అందలేదు. బహుశ అందుకేనేమో ఊహకు అందని విషయం, అర్థంగాని విషయం ఎదురైతే ఆ భగవంతుడు చేశాడు అనుకుంటారు.

భగవంతుడు అనే ఒక దివ్యశక్తి ఉందని చాలామంది అంగీకరించి ఉండవచ్చు. సహజంగా ఉండే కుతూహలం వల్ల ఆ ప్రాణి భగవంతుడిని చూద్దాం, అది ఎలా ఉంటుందో తెలుసుకుందాం అనిపించి, కాలక్రమంలో తదేక దృష్టితో, గట్టి సంకల్పం వల్ల ఒక రకమైన ఉన్మత్త స్థితిలో తనలాంటి ఇంకొక ప్రాణిని చూసి అదే భగవంతుడు అన్న భ్రమ వచ్చి ఆ రూపాల పట్ల ఒక నమ్మకం కలిగి అదే భగవంతుడు అనే నిశ్చయానికి వచ్చి ఉండవచ్చు. అలా ఏర్పడినవే ఈ రోజు మనం పూజిస్తున్న మానవ స్వరూప రూపాలు అయి ఉండవచ్చు. మరికొన్ని చోట్ల, తమ చుట్టూ ఉండే పరిసరాలను, తమను మనవేతర ప్రాణులు, వాటి బుద్ధికి అనుగుణంగా ప్రవర్తించి చేసిన క్రియలను, మానవులు తమ రక్షణకు చేశాయని నమ్మి, ఆ ప్రాణుల రూపాలను కూడా పూజించడం మొదలుపెట్టరు. ఇంకొంత మంది ఆ ప్రాణుల రూపాలను మానవ రూపాలతో కలిపి నరసింహుడు, వరాహమూర్తి, గణపతి లాంటి రూపాలను ప్రచారం చేసి ఉండవచ్చు. అలా మానవుడు ఒక అడుగు ముందుకు వేసి ప్రకృతిలోని పదార్థాలతో తను అర్థం చేసుకుని నమ్మిన భగవంతుడి రూపాన్ని తయారు చేసి చాలా చోట్ల ఆలయాలు కట్టి తనకు తోచిన విధంగా పూజా విధానాన్ని రూపొందించుకుని ఆచరించ సాగాయి.

నా దృష్టి ఇక్కడ నన్ను ఇంకొక విధంగా ఒప్పించింది. భగవంతుడి రూపం మానవాకారంలో ఉండడానికి కారణం, అది మానవులకు కలిగిన ఆసక్తి వల్లే. చీమలకు చీమ ఆకారంలో, పురుగులకు వాటి ఆకారంలో భగవంతుడు ద్యోతకం అయి

ఉండవచ్చు. లేదా మానవేతర ప్రాణులకు భగవంతుని గురించి తెలుసుకుందాం అన్న జిజ్ఞాస లేదా ఆలోచనా శక్తి లేకపోవచ్చు. అవి తమ ఆకలిని, శారీరిక అవసరాలను తీర్చుకునే క్రియలను మాత్రమే చేస్తూ తీరిక దొరక్క అంత ఆలోచన చేయలేదేమో. వాటి భాష నాకు రాదు కాబట్టి వాటితో నేను మాట్లాడలేను కాబట్టి ఈ ఊహాజనిత సందేహం అలా సమాధాన పడింది.

ఈ స్వరూప ఆరాధనా విధానాన్ని ఇతర మానవులు చూసి తెలుసుకుని మరింత ప్రచారం చేశారు. ఈ ప్రచారం కోసం ప్రయాణాలు చేస్తూ, వివిధ ప్రాంతాల వారితో సంభాషణలు చేస్తూ, వారి జీవనశైలిని అర్థం చేసుకుంటూ, వారు అప్పటికే అర్థం చేసుకుని ప్రార్థిస్తున్న భగవంతుడి రూపం మరొకటి చూసి ఇంకొక భగవంతుడు ఉన్నాడు అన్న అభిప్రాయానికి వచ్చి ఉండవచ్చు. ఇందుకు ఒక కారణం కావచ్చు. పూర్వకాలంలో మానవుల ప్రయాణం ప్రయాసతో కూడినదై ఉండడం వల్ల, తము ఉన్న చోట తోటి మానవ సంఘాలతో కలసి ఒక దేవుడి రూపాన్ని కల్పించి ఆరాధన చేయడం, అది మరొక ప్రాంతం లోని పూజింపబడుతున్న రూపంతో పోలిక లేకపోవడం వల్ల చాలా మంది భగవంతుళ్ళు ఉన్నారని భ్రమ పడి ఉండవచ్చు. ఇక్కడ నాకు అర్థం అయిన విషయం – కేవలం మానవుల బుద్ధి మరియు చింతన నుంచి వచ్చినదే రూపం.

కొన్ని చోట్ల వాదులాడి పోట్లాడి వైరం వల్ల భగవత్స్వరూపల మధ్య వైరిని ఊహించి ఉండవచ్చు. ఇంకొన్ని చోట్ల విద్వేషాలను పక్కకు పెట్టి కలుపుగోలుతనం వల్ల భగవత్స్వరూపాల మధ్య స్నేహపూరిత వైఖరిని ఊహించి ఉండవచ్చు. మానవులు ఇతర మానవులతో ఏర్పరుచుకున్న బంధాలు, బంధుత్వాలు భగవంతుడికి కూడా ఆపాదించి భగవానుడికి కళ్యాణం చేసి కుటుంబం ఏర్పాటు చేసి ఉంటారు. అలా వచ్చినవే ఇన్ని రూపాలు.

మరి రూపం అనేది మిథ్య అని అర్థం అయినప్పుడు, భగవంతుడి గురించి తెలుసుకోవడం ఎలా సాధ్యమవుతుంది? పెద్దలు దీనికి ఒక రీతిలో సమాధానం ఇచ్చారు. తత్త్వం తెలుసుకోమని చెప్పారు. గుణాలను అర్థం చేసుకోమని చెప్పారు. వాత్సల్యం, జ్ఞాన సమృద్ధి, అఖండ ఐశ్వర్యాధిపత్యం, ఇత్యాదులను గుర్తించమని చెప్పారు. ఉగ్ర స్వభావం, ప్రశాంత స్వభావం, క్రమశిక్షణ ఉన్న స్త్రీ పురుష రూపాలు, రక్షణ, హింస చేయగలిగిన మానవ స్వరూపాలు మరియు జంతు మిళితమైన స్వరూపాలు, విష్ణువు, లక్ష్మి అనబడే అలంకార ప్రియత్వం కలిగిన రూపాలు, బుద్ధి వైభవానికి ప్రతీక అయిన బ్రహ్మ, సరస్వతి రూపాలు, రాజుల రాణుల రూపాలలో చూడబడిన రాముడు, కృష్ణుడు, దుర్గ మొదలయిన రూపాలు, ఇవన్నీ కేవలం మానవ కల్పిత భగవత్స్వరూపాలు అని, అవి ఒక రకమైన మానసిక స్థితిలో ఉండి తదనుగుణంగా మరొక ప్రాణిని చూడడం వల్ల అనిపించి ఉండవచ్చు అని నాకు అర్థం అయింది. కాబట్టి తత్త్వం ద్వారా కూడా భగవంతుడిని ఖచ్చితంగా తెలపడంలో నా దృష్టి బలహీనపడింది.

మరి భగవంతుడి రూపం చూడాలంటే ఎలా అన్న ప్రశ్నకు సమాధానం తయారయే ముందు ఈ ప్రకృతిని మళ్ళీ గమనించాలి. చేసే పనులవల్ల భగవంతుడు అనేది తెలియబడుతుందా? పనులు, అంటే కర్మల వల్ల ఫలితాలు నిర్దేశింపబడతాయి అని పెద్దలు అంటారు. ఈ భూమి మీద జీవి చేసే కర్మలు, వాటి ఫలితాలు గమనించి, జన్మలు–పూర్వజన్మ కర్మలు అనే సిద్ధాంతం తయారయింది. ఇక్కడ నాకొక ప్రశ్న. జన్మలోని కర్మలు ఆత్మ వల్ల మరొక దేహానికి వెళ్తాయని ఒక ప్రచారం ఉంది. కర్మల ఫలితాల వల్లే ఆ దేహానికి సుఖదుఃఖాలు వస్తయని అంటారు. మరి భగవద్గీతలో ఆత్మకి రూపం లేదు, దానికి ఏదీ అంటదు అన్న ప్రతిపాదన ప్రకారం ఈ కర్మలు వాటి ఫలితాలు ఎలా బదిలీ అవుతాయి.?

దీనికి మొదట్లో నాకు వచ్చిన సమాధానం – కర్మ వాసనలు ఆత్మతో ప్రయాణం చేస్తాయి అని. మరి రూపం లేని ఆత్మకు ఎలా తగులుకుని ప్రయాణం చేస్తాయి? ఇంకా దీనికి విశ్వసించదగ్గ సమాధానం తెలీదు. అయితే నా దృష్టి దీనికి ఒక సమాధానం చెప్పింది. కర్మలు, వాటి ఫలితాలు ప్రకృతి అధీనంలో ఉంటాయి. అంటే అందులోనే ఉంటాయి. ఒక ప్రాణి చనిపోగానే ఆ కర్మలు వాటి ఫలితాలు ఇంకొక ప్రాణికి బదిలీ కావచ్చు. అది కొత్తగా పుట్టిన ఇంకొక ప్రాణి కావచ్చు. లేకపోతే ఏ బంధుత్వం కానీ, పరిచయం కాని లేని ప్రాణి కవచ్చు. ఈ కర్మల ప్రభావం వల్ల, వాటి ఫలితాల వల్ల ఉత్పన్నమయ్యే మరిన్ని కర్మల వల్ల, ఇవన్నీ పోలికలతో ఉండడం వల్ల, నిశిత బుద్ధి కలిగిన వ్యక్తులు జన్మాంతర కర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ఉండవచ్చు. వారినే జాతక బ్రహ్మలు అని, జ్యోతిష్యులు అని సంబోధిస్తూ ఉన్నాము. వారు తమకున్న శక్తిని బట్టి ఊహించి చెప్పిన విషయాలు జరగడం వల్ల, వారి అంచనా వేసే శక్తిని నమ్ముతాము. మరి బదిలీ అయిన కర్మల వల్ల లాభం ఏమిటి? ప్రస్తుత నా జ్ఞాన స్థితిని బట్టి ఉన్న సమాధానం – లాభం ఏమీ లేదు. అంటే కేవలం కర్మలు అలా కొనసాగించడం, వాటి ఫలితాలను అనుభవించడం.

కర్మ అంటే జీవం వల్లకానీ, జీవం లేని దాని వల్లగానీ ప్రకృతిలో సంభవించే మార్పు. ఇది ప్రకృతి పట్లే కాక తోటి జీవుల పట్ల కూడా ఉంటుంది. మంచి కర్మల వల్ల సుఖం వస్తుందని, చెడు కర్మలవల్ల దుఃఖం వస్తుంది అని, తోటి ప్రాణులు తమ బుద్ధి వల్ల నిర్ణయించి పాప పుణ్యాలు నెలకొల్పారు. ఒకరికి మంచి అనిపించేది వేరొకరికి చెడు కావచ్చు. కాబట్టి కేవలం బుద్ధి వల్ల ప్రేరణ పొందిన వేరొక ప్రాణి ప్రభావం వల్ల కర్మ ఫలితాలు నిర్ణయింపబడుతున్నాయి. అందువల్ల కర్మలు బదిలీ అవడం అనే విషయం కేవలం భ్రమ మాత్రమే అయి ఉండవచ్చు. తోటి ప్రాణులను కట్టడి చేసేందుకు కల్పించబడినవే ఆత్మలు, వాటి జన్మలు, కర్మ బదిలీలు, కర్మ అనుభవాలు.

ఇక్కడ ఆత్మ అన్న విషయం మీద ఇంకొంత ఆలోచన ఘర్షణ నాకు అవసరం.

జీవాలు చాలా రూపాలలో ఉన్నయి. మానవులు, కోతులు, కుక్కలు, ఆవులు, సింహాలు, కోళ్ళు, చీమలు, పురుగులు, పాములు, బల్లులు, చేపలు, పక్షులు మొదలయినవి. అన్నీ ఈ భూమి మీద ఉన్నయి. వీటిలాగే ఉండే వీటి పిల్లలు కూడా ఈ

భూమి మీదే ఉంటాయి. “ఉన్నాయి” అన్న పదానికి అర్థం – వాటి శరీరాలు ఈ భూమి మీదే ఉన్నాయి. పుట్టినప్పుడు వాటి శరీరాలు ఈ భూమి ఆవరణలో కనిపించాయి. చనిపోయినప్పుడు వాటి శరీరాలు ఈ భూమి ఆవరణలోనే శుష్కించిపోతున్నయి. పుట్టినప్పుడు ఎక్కడ నుంచో వచ్చి, చచ్చినప్పుడు ఎక్కడికో పోవట్లేదు అని అర్థం అవుతోంది. ఇక్కడే పుట్టి, పెరిగి, జీవించి, చనిపోతున్నాయి. మరి ఏం జరుగుతోంది?

మన పూర్వీకులు ఆత్మ అనేది చెప్పారు. అది ఉండడం వల్ల బ్రతికి ఉన్నాయి అని, అది బయటకు రావడం వల్ల మరణం అని భావించారు. ఇక్కడ నాకొక సందేహం. బయటకు రావలంటే అసలు లోపలకి వెళ్ళాలి కదా. ఎలా ఎప్పుడు వెళ్ళింది? కొంతమంది స్త్రీ గర్భవతిగా ఉన్నప్పుడూ చేసే ఆత్మలోపలికి వెళుతుంది అంటారు. అప్పుడు గర్భం మొదట్లో శవ రూపంలో శరీరం ఉంటుందా? ఇక్కడ మానవుడు కనిపెట్టిన సైన్సు సమాధానం చెప్తుంది. స్త్రీ గర్భంలోకి చలనం ఉన్న పురుష వీర్యకణాలు వెళితే శరీరం తయారవడం మొదలవుతుంది అని. అంటే ఆత్మ అంతకు ముందే “లోపలికి” వెళ్ళి ఉండాలి. ఎలా? మరి జీవం లేనివి, అంటే రాళ్ళు, నీళ్ళు, చెట్లు మొదలయినవి కూడా ఆత్మను కలిగి ఉన్నాయా? మరి రాయికి మరణం ఎలా?

సృష్టి, ప్రకృతి, ప్రపంచం అని వివిధమైన పేర్లతో పిలువబడుతున్న కనిపించేది మొత్తం వస్తువులతో కూడుకుని ఉన్నది. కొన్ని వస్తువులు తిరుగుతున్నాయి. కదులుతున్నాయి. కొన్ని కదలలేక ఉన్నాయి. వీటిలో కొన్ని తమంతట తాము కదులుతాయి. లేదా ఇంకొక వస్తువు ప్రేరేపించడం వల్ల కదులుతాయి. ఉదాహరణకి అయస్కాంత శక్తి. కదలలేని వస్తువులు కొన్ని కదిలే వస్తువు వల్ల ప్రేరణ పొంది తక్కువగా కానీ ఎక్కువగా కానీ కదులుతాయి. మరికొన్ని చాలా తోస్తే తప్ప కదలవు. ఈ చలనం అనేది ప్రకృతిలో ముఖ్యమైన లక్షణం. ఈ కదలికల వల్లే మార్పులు పదార్థం లో సంభవిస్తున్నాయి.

సైన్సు పరంగా అన్వయం చేసుకుంటే అన్ని వస్తువులయందు కొన్ని వందల లక్షల కోట్ల కొద్దీ అణువులు ఉన్నాయని తెలుస్తోంది. వస్తువు అంటే ఒక పరిధి కలిగిన ఆణువుల సమూహం.అణు స్థాయికి వెళ్ళి ఆలోచిస్తే ప్రతి అణువుకు మూడు లక్షణాలు ఉంటాయి.

౧. తనలో శక్తి కదలిక ఉండి తను కూడా కదలగలిగిన శక్తి ఉండుట.
౨. వేరే అణువులతో స్పందించుట, వాటి స్పందనకి ప్రతిస్పందిచుట.
౩. తనలో తను విభజింపబడుట లేదా వేరే అణువులతో కలయుట.

అణువులలో శక్తి మూలకాలు ఉన్నాయి. ఇవి ఇంకొక అణువులలో ఉండే శక్తి మోతాదును బట్టి వివిధ రకాలుగా శక్తిని ఉత్తేజింపచేసుకుంటాయి. రసాయన శాస్త్రం పట్ల అవగాహన ఉంటే ఈ విషయం బాగా అర్థం అవుతుంది. అణు స్థాయిలో ఉత్తేజం పొందిన శక్తి మూలకాలవల్ల అవి సమూహంగా ఏర్పడిన పదార్థాలు ప్రత్యేకమైన లక్షణాలను కనబరుస్తాయి. ఇలా

ఏర్పడినవే ఘన, ద్రవ, వాయు పదార్థాలు. ఇవి వేరే పదార్థాలతో స్పర్శ పొందినప్పుడు ప్రత్యేకమైన ప్రతిస్పందనను కనబరుస్తాయి. ఉదాహరణకు ద్రవ పదార్థమైన నీరు ఘన పదార్థమైన రాయితో కలిసిపోకపోయినా, దాని ఆకారం లో మార్పుజరిగి ప్రవాహం మారుతుంది. అలాగే ఒక ప్రత్యేకమైన మోతాదులో రెండు పదార్థాలు కలిపితే పరస్పరం ప్రతిస్పందనల వల్ల విస్ఫోటనం సంభవిచవచ్చు. ఇంతకు ముందు కనిపించని పదార్థం ఉత్పన్నమవవచ్చు.

ఇలా ప్రతి పదార్థంలో స్పందన ప్రతిస్పందన లక్షణాలు ఉంటాయి. కలయికలవల్ల తయారయిన పదార్థాలు నిరంతరం ఇంకొక పదార్థం వల్ల ప్రతిస్పందిస్తున్నాయి. ఇలా చాలా కాలం నుంచి జరుగుతుంది. జరుగుతూనే ఉంటుంది. ఇలా ప్రతిస్పందిస్తున్నప్పుడు ఆ అణువులలో మూలంగా ఉన్న శక్తి మార్పు చెందుతుంది. ఆ శక్తి ఒక మోతాదులో అణువును కదపగలదు. ఇలా కదిలిన అణువులో ఉన్న శక్తి దాని పక్కన ఉన్న అణువుకు చేరి దానిని కూడా కదపగలదు. ఇలా అణువులలో శక్తి సంఘాతం వల్ల కదిలిన కదలిక అవి తయారయి ఉన్న పదార్థాన్ని కదపగలదు. ఈ శక్తి మోతాదు తక్కువగా ఉంటే పదార్థం కదలలేదు. ఈ శక్తి తీవ్రతను బట్టి మూడవ లక్షణం వస్తుంది — తనలో తాను విభజింపబడుట లేదా కలుపుగొనుట.

అంటే అణువుల సమూహం మధ్యలో ఇంకొక రకం అణువుల సమూహం వచ్చిచేరుతుంది. దీనినే పదార్థం విడివడుట అంటారు. మరొక కోణంలో, ఒకొక్క సారి ఇంకొక రకం అణు సమూహాన్ని తన  అణు సమూహం లో కలుపుకుని ఒక పెద్ద అణు కూటమిగా మారుతుంది. ఇలాంటి అణుకూటమిలో మళ్ళీ స్పందన-ప్రతిస్పందనల వల్ల కలువుట విభజింపబడుట జరుగుతూనే ఉంది. అలా సంభవించినవే వివిధ పదార్థాలు, రసాయనాలు, వాయువులు, రాళ్ళు, మట్టి, చెట్లు, క్రిములు, జీవాలు, ప్రాణులు, ఆకాశాలు, గ్రహాలు, అంతరిక్షాలు, పాలపొంతలు, వగైరాలు.

ఈ మార్పు జరిగే లక్షణం సమస్త పదార్థాల సృష్టికి మూలం. అణువులు కదులుట, పరివర్తనం చెందుట, ప్రతిస్పందించుట. వీటి వల్ల కొత్త పదార్థాలు పుడుతున్నయి. మరికొన్ని ప్రతిస్పందనల వల్ల తన లక్షణం కోల్పోయి ఇంకొక పదార్థం లో కలిసిపోతున్నాయి. అలా తయారయిన జీవులు కూడా ఈ లక్షణాలనే కనబరుస్తాయి. ముఖ్యంగా ఒక ప్రాణి తయారవాలంటే బోలెడన్ని అణువులు కావాలి కదా. కాబట్టి ఉన్న కణాలు పరివర్తనం చెంది ఒకటి రెండుగా, రెండు నాలుగుగా, నాలుగు ఎనిమిదిగా అలా గుణింపబడుతూ పురుష శరీరం లో అభివృద్ధి చెందుతాయి. ఇవి శక్తి కేంద్రాలు అంటే శక్తి వల్ల కదులుతాయి.

ఈ కదిలిన కణాలు శరీరంలో చోటు సరిపోక ఉన్న కణాలు పక్కకు జరిగి, లేదా బయటకు పంపబడి కొత్త కణాలు తయారవుతాయి. ఇలా శక్తి మూలకమైన కణాలు శరీరం నుండి వెళ్ళేడప్పుడు సుఖదుఃఖాలనే  అనుభూతులను కలిగిస్తాయి. ఈ కణాలు అతి వేగంగా ఒక వస్తువుగా తయారవడలో వాటిలో అంతర్భాగంగా ఉన్న శక్తి కారణమవుతుంది. ఈ శక్తి

కణాలు స్త్రీ గర్భం యొక్క అండంలో ప్రవేశించి అక్కడ వృద్ధి చెందుతాయి. ఈ కణాలు తమ ఏ సమూహం నుంచి విడిపోయాయో వాటి తరహాలోనే ఉంటాయి. అలాంటివి తదనుగుణంగా ఉండే మరొక కణ సమూహంతో కలిసి శరీరం అనే వస్తువు తయారవడానికి కావలసినట్టుగా వివిధ రకాలుగా విడుతూ మళ్ళీ కలుస్తూ మళ్ళీ విడుతూ మాంసము, ఎముకలు, కళ్ళు, చెవులు, కడుపు లాంటివి తయారవుతాయి.

అలా తయారయిన శరీరానికి శక్తి ప్రసరణ కేంద్రాలు పలుచోట్ల ఉంటాయి. ఉదాహరణకు గుండె, మెదడు. ఇవి మనిషికే కాక ప్రాణులన్నిటికీ ఉంటాయి. ఈ శక్తి ప్రసరణ కేంద్రాల ద్వారా శరీరం బయట ఉన్న ప్రకృతి లో ఉన్న శక్తిని కలిగిన అణువులను ఆహార రూపంలో చేర్చుకుని, తిరిగి కొంత శక్తిని అణువులను ప్రకృతికి ఇస్తుంది. ప్రకృతి శరీరాలు పరస్పరం శక్తిని ఇచ్చి పుచ్చుకుంటూ ఉంటాయి.

శరీరంలో శక్తి కేంద్రీకరణ తగ్గగానే తిరిగి శక్తిని పుంజుకోవడానికి ఆహార రూపంలో గానీ ఔషధాల రూపం లో గానీ సహాయం కావాలి. ఇలా జరిగిన తరువాత బలం వచ్చినట్టు అనిపిస్తుంది. వచ్చిన బలంతో ప్రతిస్పందించుట అనే బుద్ధి వల్ల తిరిగి శరీరానికి కావలసిన కణశక్తి ఆహార రూపంలో తీసుకుంటుంది. ఈ శక్తి మోతాదు తగ్గినప్పుడు ముఖ్య శక్తి కేంద్రం అయిన మెదడుసు స్పందించుట అనే లక్షణం తగ్గిపోతుంది. ఇతరులకు ఇది చలనం లేని స్థితిగా అనిపిస్తుంది. తిరిగి స్పృహ పొందలేనంతగా శక్తి క్షయం అయితే మృత్యువు అని పిలువబడుతుంది.

నిద్ర, స్పృహతప్పుట, మృత్యువు – ఈ మూడింటికీ వ్యత్యాసం ఉంది. నిద్రలో శరీరం తానకు తానుగా శక్తిని వృద్ధి చేసుకోగలదు. అలా కాక బలవంతంగా కానీ, వేరొకరి బుద్ధి చేత నిర్ణయింపబడిన ఔషధం అనే కణ సమూహాన్ని గ్రహించినప్పుడు కానీ శక్తిని వృద్ధి చేసుకుంటే స్పృహ తప్పి తిరిగి స్పృహలోనికి వచ్చుట. ఇక ఎంత చేసినా స్పృహ శక్తిని వృద్ధి చేయడం సాధ్యం కాకపోతే మృత్యువు అనవచ్చు. కాబట్టి మృత్యువు తరువాత తిరిగి ప్రాణ శక్తిని ఉత్తేజితం చేయడం సాధారణంగా సాధ్యపడదు.

మృత్యువు తరువాత శరీరంలో ఉండే కణాలు బయట కణాల ప్రభావం చేత తమ లక్షణాలను మార్చుకుంటాయి. శరీరం ఉబ్బిపోవడం వాటిలో ప్రథమ లక్షణం. తరువాత శక్తి ప్రసరణ తగ్గిపోవడం వల్ల లోపలి కణాలు ఒక దానితో ఒకటి విపరీతంగా ప్రతిక్రియ జరుపుతుంటాయి. శరీరం కుళ్ళడం మొదలవడం ఇక్కడే. ఇలా పరివర్తనం చెందిన కణాలు బయట కణాలతో కలిసిపోతాయి. అందుకే మృత్యువు తరువాత కూడా శరీరంలో సూక్ష్మస్థాయిలో మార్పులు ఉంటాయి. వీటి వల్లే శవ వాసన, కుళ్ళడం, జీర్ణమైపోవడం లాంటివి సంభవిస్తాయి. మృత్యువు తరువాత శరీరం కుళ్ళడానికి సమాయత్తం అయినప్పుడు ముందుగా శరీరంలోని చర్మం నుంచి, రంధ్రములనుండి కణాలు వాటి సహజ తత్త్వం వల్ల గాలిలో కలిసి, గాలిలో ఉండే చలన స్థితి వల్ల పరిసరాలలో వ్యాపిస్తాయి. ఇవి వాటి స్థూల శరీర అవశేషాలను కొన్ని మలిన రూపంలో కలిగి

ఉంటాయి. అవి ఇంకొక ప్రాణి ముక్కును చేరి వాసన అనబడే ప్రతిస్పందనగా మారుతూ వేరొక చోటకు చేరుతాయి. మలిన కణాలు నిదానంగా పరివర్తనం చెంది, తమ నిజ రూపం అయిన శక్తి కణాలుగా మారతాయి. మృత్యువు అనేది అణువుల మధ్య జరిగే అదొక రకం క్రియ.

ఇలాంటి స్పందన ప్రతిస్పందన క్రియలు చాలా పదార్థాలలో జరుగుతాయి. వీటికి పట్టే సమయం పదార్థాన్ని బట్టి అందులో ఉండే స్థితిని బట్టి అణువుల కలయిక బంధాన్ని బట్టి మారుతుంటాయి. ఇలాంటి సహజ క్రియ చాలా వేగంగా మార్చగలిగిన స్థితి, శక్తి అగ్నికి ఉంటుంది. అగ్ని త్వరగా కణముల యొక్క స్థితులను మార్చగలదు. రసాయనిక చర్యలు అనబడే అణువుల స్పందన ప్రతిస్పందనలను నియంత్రించగల శక్తి, మార్పు చేయగలిగిన శక్తి అగ్నికి ఉంది. ఈ అగ్ని సరళ భాషలో కేవలం శక్తి ప్రసరణ మూలకం. అగ్నిలో ఉన్న విశేష లక్షణం ఇదే. ఇందులో మిగితా కణములకు కావలసిన శక్తిని ఇవ్వడానికి సాధ్యమవుతుంది. అగ్నివల్ల శక్తి ఉత్తేజితమవుతుంది. ఆ కణములకు తన శక్తిని నింపి వాటి పరిసరకణములకు తరువాత వాటి పరిసర కణములకు శక్తి ప్రసరణ జరిగి ఊర్జ అనేది వ్యాప్తి చెందుతుంది. ఆ కణములు ఊర్జ వలన వాటికి తగిన మార్పును ప్రదర్శిస్తాయి. వేడి, చల్లదనం, వస్తు రూప పదార్థములలో మార్పులు, కణములు కొత్త శక్తి స్పందనలు వ్యక్త పరుచుట శీఘ్రముగా విడుట కలువుట అగ్ని వల్లనే సంభవిస్తున్నాయి. అణు సంఘాతంలో అగ్ని చాలా ముఖ్య పాత్ర నిర్వహిస్తున్నది.

అగ్నికి ఉన్న ఈ తత్త్వం వల్లనే శాస్త్రవేత్తలు కొత్త వస్తువులను కనుగొనడం జరుగుతున్నది. అవి కొత్త వస్తువులు కావు. కేవలం కణముల మధ్య ప్రతిస్పందనను కలయికను అగ్ని వల్ల మార్పుచేయడం వల్ల ఏర్పడ్డ మరో కణ కూటము. ఇలా అగ్ని వల్ల ఏర్పడ్డ వస్తువుకు చలనశక్తి వివిధ మోతాదులలో ఉంటుంది. కొన్నింటికి చలన శక్తి చాలా ఎక్కువ ఉండి చలించి మరల చలనం లేని స్థితికి వస్తాయి. ఇంకొన్నిటికి చలనశక్తి చాలా తక్కువ ఉండి అవి కేవలం ఇంకొక వస్తు ప్రభావం వల్ల కాని వాటి ఆకర్షణ వికర్షణ శక్తుల వల్ల కాని సంభవిస్తాయి. ఈ చలనం ప్రాణుల వల్ల కూడా సంభవమే. ఇలాంటి వస్తువులు తిరిగి అగ్ని కారణంగా మార్పు చెండడం కానీ, విస్ఫోటనం చెండడానికి కావలసిన ఒత్తిడిని తయారు చేయడం కాని సంభవిస్తాయి. ఇలా విస్ఫోటనం చెందిన వాటి అణు కలయికలు ఇంకోలా ఉండడం వల్ల రాళ్ళు ఏర్పడ్డాయి. ఈ రాళ్ళు తిరిగి అగ్ని మూలక శక్తి కారణంగా ఆకర్షణకు లోనై చలనం పొందుతున్నాయి. ఇలా ఏర్పడినవే గ్రహాలు వాటి స్థితిగతులు. గ్రహాలు అంటే జ్యోతిష్యం లోని నవగ్రహాలు కాదు. ఖగోళ గ్రహాలు. ఇవి అగ్ని తత్త్వం వల్ల పలు మార్పులకు లోనై నేడు ఉన్న స్థితికి చేరాయి. ఇంకా మార్పులు సంభవిస్తూనే ఉన్నాయి. ఉంటాయి.

ఈ విషయం రాయడం పూర్తి అయ్యేసరికి బ్రహ్మాండంలో ఎక్కడో ఇంకొక విస్ఫోటనం జరిగి ఉండవచ్చు. మానవుడు ఎరుగని కొత్త పదార్థం తయారవడానికి కావలసిన మార్పులు, కొత్తరకం అణువులు సృష్టించబడి అణు కూటములు ఏర్పడి ఉండవచ్చు. అదలా ఉంచితే ఇప్పుడు మనమున్న భూమి సైన్సు పరంగా ఒక మండుతున్న అగ్నిగోళం. ఇది తిరుగుతున్న

సూర్యుడు ప్రత్యక్షంగా ఉన్న అగ్ని తత్త్వం. భూమి దాని ఉపగ్రహం మిగితా గ్రహాలు ఆ సూర్యుడిలో జరిగిన విస్ఫోటన ఫలితం అని సైన్సు రుజువు చేసింది. ఇక్కడ నాకు ఇంకొక అనుమానం ఉంది. నిత్యం చేయవలసిన సంధ్యావందనం దేనిని ఆధారం చేసుకుని ఉంది? సూర్య ప్రభావితమైన భూమి యొక్క గతిని బట్టి ప్రాణుల కళ్ళకు కనిపించే పగలు రాత్రి వల్ల మాత్రమే.

అసలు సంధ్యావందనం అనే క్రతువు పుట్టకముందు, వేదములు చెప్పబడక ముందు, మానవులు భగవంతుడిని ఎరుగక ముందు, యుగాలు నిర్ణయింపబడే బుద్ధి కలుగక ముందు, మానవులు కోతుల నుంచి రూపాంతరం చెందక ముందు, కోతులకి ముందు, కోతులకి ముందు ఉండే ప్రాణులకి ముందు, అసలు ప్రాణి అనేది కలుగక ముందు, అందుకు కావలసిన అణు సంఘాతం భూమి మీద కలుగక ముందు, భూమి అగ్ని శకలంగా ఉండక ముందు, సూర్యుడిలో విస్ఫోటనం జరిగి భూమి వేరుపడక ముందు, ఆ సూర్యుడు మరొక అణు కూటములో భాగంగా ఉండక ముందు, వాటన్నిటికి పూర్వం ఉన్న అగ్ని మూలక విస్ఫోటక కణ కూటమికి ముందు, అసలు ఈ బ్రహ్మాండంలో మొదటి వస్తువు తయారవకముందు, అసలు మొదటి అణువు పుట్టక ముందు, అతి విశాలమైన ఊహకి అందనంత పెద్దదిగా ఉండే ఒక ఖాళీ స్థలం ఉండక ముందు స్థితి ఊహిస్తే?

ఎందుకు మొదటి అణువు తయారయింది? ఎలా మొదలయింది? అప్పుడు కాలం ఎంతగా నిర్ణయింపబడింది? ప్రాణులకి ఊహ సంకుచితమై ఎందుకు ఉంది? ఇప్పుడున్న బ్రహ్మాండం ఏక కాలంలో ఎంత పెద్దదిగా ఉంది, ఇంకెంత పెద్దదవుతుంది. నాలాంటి ఇంకొక ప్రాణి వేరొక గ్రహం మీద ఇంకెక్కడో ఉన్నదా? ఇవన్నీ నాకు ఎందుకు తెలియడం లేదు?

అంతకు ముందుగా ఎలా ఉండేది? అసలు అక్కడ ఏమి ఉండేది? అణువు తయారవడానికి కారణమైన శక్తి ఉండడానికి ముందు ఏమి ఉండేది? దేని వల్ల మొదటి అణువు నుంచి మొదలయిన ఈ సృష్టి కొన్ని లక్షల కోట్ల సౌరమాన ఘడియల తరువాత ఇది రాస్తున్న ప్రాణికి అణు సంఘాతం వల్ల ఆలోచన పుట్టింది? అలాంటి ఆలోచన వచ్చిన బుర్రకి కేవలం అణు సంఘాతమైన క్రియ జరుగుతున్న ఈ బ్రహ్మాండంలోని సూర్యుడి ఛాయవల్ల, భూమి తిరగడం వల్ల కనిపించే పగలు రాత్రి కలిసే సంధ్యా సమయంలో అర్ఘ్యం ఇవ్వకపోతే పాపము అని చెప్పిన మరొక అణుకూటమి అయిన ఇంకొక ప్రాణి చెప్తే ఎలా చేయాలని అనిపిస్తుంది?

మొదటి అణువుకు ఉన్న పూర్వ స్థితి అర్థం అవ్వలేదు. అందుకే ఈ ఆలోచనా ప్రవాహానికి అడ్డు తగిలింది. అసలు అక్కడ ఏమి ఉండేది? కారణం అవసరం లేని స్థితి నిజంగా ఉందా?